సాక్షి ప్రకాశం

గురువారం । 12 । అక్టోబర్ । 2023



దర్యాప్తు వేగవంతం చేయండి

కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు. ఎస్పీ కార్యాలయంలోని గెలాక్సీ భవనంలో నేర సమీక్ష నిర్వహించారు. - 8లో..



పేదల తలరాతను మార్చిన జగన్

పేదల జీవితాల్లో వెలుగులు నింపి వారి తలరాతను మార్చాలన్నదే సీఎం జగన్ లక్ష్యమని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
35.5/26.6

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉక్కపోత అధికం. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఒంగోలు: జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం స్థానిక జిల్లా ప్రజా పరిషత్ పాత సమావేశ మందిరంలో మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమవుతుందని జెడ్పీ సీఈవో బి.జాలిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత సమావేశాన్ని ఉదయం 10.30 గంటలకు ప్రారంభించాలని నిర్ణయించి ఆమేరకు సభ్యులందరికీ నోటీసులు జారీచేశారన్నారు. అయితే గురువారం ఉదయం జగనన్న కాలనీల గృహ ప్రవేశాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తుండడం, అందులో మన జిల్లాలో చీమకుర్తి మండలంలోని కేవీ పాలెం గ్రామంలో కూడా నిర్వహించాల్సి ఉందన్నారు. ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సిన దృష్ట్యా సర్వసభ్య సమావేశాన్ని మధ్యాహ్నం 2.30 గంటలకు మార్పుచేశారని, సభ్యులు గమనించాలని సీఈవో విజ్ఞప్తి చేశారు.

కేజీబీవీలో ప్రిన్సిపాల్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ఖాళీగా ఉన్న ఓసీ మహిళా అభ్యర్థిని (స్పోర్ట్స్ కేటగిరీ)కి చెందిన ఒక ప్రిన్సిపాల్ పోస్టును కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు అర్హులైన, ఆసక్తిగల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ వీఎస్ సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈనెల 13వ తేదీలోగా సమగ్రశిక్ష కార్యాలయం పని వేళల్లో సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు అన్ని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో దరఖాస్తులు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

రేపు ఎస్‌జీఎఫ్ తైక్వాండో, జూడో క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 తైక్వాండో, జూడో క్రీడాకారుల ఎంపికను ఈ నెల 13వ తేదీ నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులు పాల్గొనేందుకు అర్హులని చెప్పారు. చీరాల ఓడరేవు రోడ్డులో ఏకేపీ అండ్ పీకే జూనియర్ కాలేజీ ఎదురుగా సెయింట్ మార్క్ లూథరన్ చర్చి కమ్యూనిటీ హాలులో తైక్వాండో క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తారన్నారు. వివరాలకు పీడీ అంకరాజు, సెల్ నంబర్ 9493923121ను సంప్రదించాలన్నారు. జూడో క్రీడాకారుల ఎంపికను సింగరాయకొండ మండలం పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటలకు నిర్వహిస్తారని తెలిపారు. వివరాలకు పీడీ హజరత్తయ్య, సెల్ నంబర్ 9848606573ను సంప్రదించాలన్నారు. అండర్-17 కేటగిరీలో పాల్గొనే ఇంటర్ విద్యార్థులు తప్పనిసరిగా పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, జ్ఞానభూమి చైల్డ్ ఐడీ నంబర్, సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రాలను నిర్వాహకులకు సమర్పించి ఎంపికలో పాల్గొనాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ స్పష్టం చేశారు.

నేడు టెన్నిస్ జట్ల క్రీడాకారుల ఎంపిక

గిద్దలూరు రూరల్: పట్టణంలోని క్లబ్ రోడ్డులోని టెన్నిస్ కోర్టు ప్రాంగణంలో గురువారం ఉదయం 9.30 గంటలకు టెన్నిస్ జట్ల క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ చీఫ్ ఆర్గనైజర్ గుర్రం శోభన్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, అండర్-17 క్రీడాకారులు టెన్నిస్ క్రీడ ఎంపిక కార్యక్రమంలో పాల్గొనవచ్చని ఆయన స్పష్టం చేశారు. పూర్తి వివరాల కోసం 96188 01191 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రైతు చూపు..మిర్చి వైపు

మిర్చిసాగు రైతులకు లాభాలు తెచ్చిపెడుతోంది. మార్కెట్లో గతేడాది దీని ధర ఊహించనంతగా పలకడంతో రైతులు లాభాల రుచి చూశారు. పశ్చిమ ప్రకాశంలో పెద్ద ఎత్తున మిర్చి సాగు చేస్తున్నారు. ఈ సారి కూడా లాభాలు వస్తాయన్న ఆశతో రైతులు ఎక్కువ మొత్తంలో పండించేందుకు సిద్ధమతున్నారు. ఎర్ర బంగారాన్ని జిల్లా వ్యాప్తంగా 70,244 ఎకరాల్లో సాగుచేస్తే పశ్చిమాన 53,286 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. దిగుబడి సైతం బాగా వస్తుండడంతో దీనివైపు రైతుల చూపు పడింది.

- గతేడాది లాభాలు తెచ్చిన మిర్చి
- సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు
- జిల్లా వ్యాప్తంగా 70,244 ఎకరాల్లో 35,953 మంది రైతులు సాగు
- నర్సరీల ద్వారా మిర్చి మొక్కలు కొనుగోలు
- జిల్లాలో 205 నర్సరీలు ఉండగా పశ్చిమ ప్రకాశంలోనే 160 నర్సరీలు
- పశ్చిమ ప్రకాశంలో 53286 ఎకరాల్లో సాగు



నర్సరీలో సాగవుతున్న మిర్చి నారు

మార్కాపురం: బహిరంగ మార్కెట్లో గత ఏడాది క్వింటా మిర్చి ధర రూ.25 వేలు పలికింది. ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుండడంతో రైతులు పెద్ద ఎత్తున లాభాలు చవిచూశారు. దీంతో ఈ ఏడాది దీనిని అధిక విస్తీర్ణంలో సాగు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 70,244 ఎకరాల్లో సాగుచేయగా పశ్చిమ ప్రకాశంలోనే 53,286 ఎకరాల్లో సాగైంది. డిసెంబరు మొదటివారం వరకూ మిర్చి సాగు చేయవచ్చు. దీంతో సాగు విస్తీర్ణం మరింతగా పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో మొత్తం 205 నర్సరీలు ఉండగా పశ్చిమ ప్రకాశంలోనే 160 నర్సరీలున్నాయి. ఒక్కో మిర్చి మొక్కను 2 రూపాయల ప్రకారం కొనుగోలు చేసి సాగుచేస్తున్నారు. ఎకరాకు 12 వేల నుంచి 14 వేల వరకూ మొక్కలు నాటుతున్నారు.

అధిక దిగుబడుల రకాలపై దృష్టి..

పశ్చిమ ప్రకాశంలో ఎక్కువగా తేజ, ఆర్మూరు, బ్యాడీ, జీని 26 26, 341 రకాలను రైతులు సాగుచేస్తున్నారు. ఎకరాకు 12 వేల నుంచి 14 వేల మొక్కలు నాటుతున్నారు. గత ఏడాది క్వింటా మిర్చి ధర రకాన్ని బట్టి రూ.25 వేలకు పైగా అమ్మారు. అలాగే ఎకరాకు దాదాపు 20 నుంచి 25 క్వింటాళ్ల వరకూ దిగుబడులు వచ్చాయి. అధిక లాభాలు రావడంతో వీటిపై ఎక్కువగా దృష్టిసారించారు. రకాన్ని బట్టి మొక్క రూ.1.50 నుంచి రూ.2 వరకు కొనుగోలు చేస్తున్నారు.

జిల్లాలో సాగు ఇలా...

జిల్లా మొత్తం 70,244 ఎకరాల్లో 35,953 రైతులు మిర్చిని సాగు చేశారు. ఇంకా డిసెంబరు మొదటి వారం వరకూ సాగు చేసుకోవచ్చు. దీంతో మిర్చి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. పశ్చిమ ప్రకాశంలోనే మిర్చి సాగు ఎక్కువగా ఉంది. జిల్లాలో 53,286 ఎకరాల్లో 27,567 మంది రైతులు మిర్చిని సాగుచేస్తున్నారు. ఇందులో యర్రగొండపాలెం 8357 ఎకరాల్లో, పుల్లలచెరువులో 7,388, త్రిపురాంతకంలో 5,808, తర్లుపాడులో 3,212, అర్ధవీడులో 2,751, బేస్తవారిపేట 2,439, కొనకనమిట్లలో 2,299, రాచర్లలో 2,160, పొదిలిలో 1454, గిద్దలూరులో 1,076 ఎకరాల్లో సాగుచేశారు. కాగా ముండ్లమూరులో 4,050, దొనకొండలో 2,156, దర్శి 2,056, నాగులుప్పలపాడులో 1,369, మర్రిపూడిలో 1,112 ఎకరాల్లో ఇంకా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మిర్చి సాగవుతోంది.

నర్సరీలు ఇలా...

జిల్లాలో మొత్తం 205 నర్సరీలు ఉండగా పశ్చిమ ప్రకాశంలోనే 160 నర్సరీలున్నాయి. ఇందులో బేస్తవారిపేటలో 25, కొమరోలులో 27, మార్కాపురంలో 6, పుల్లలచెరువులో 15, పెద్దారవీడులో 20, త్రిపురాంతకంలో 19, యర్రగొండపాలెంలో 9, గిద్దలూరులో 13, కంభం 3, దర్శిలో 6 నర్సరీలు, కొనకనమిట్లలో 10 నర్సరీలు ఉన్నాయి.

ఇంకా మిర్చి సాగుచేసుకోవచ్చు



నవంబరు నెలాఖరు వరకూ రైతులు మిర్చి సాగుచేస్తుంటారు. ఇప్పటి వరకూ జిల్లాలో 70,244 ఎకరాల్లో 35,953 రైతులు మిర్చిని సాగుచేశారు. మంచి నారును ఎంపిక చేసుకోవాలి. మిర్చి సాగుచేసే రైతులు ఆర్‌బీకేల్లో ఉన్న హార్టీకల్చర్ అసిస్టెంట్లను లేదా మండల కేంద్రాల్లో ఉన్న ఆఫీసర్లను సంప్రదించండి. ఎక్కడ కొనుగోలు చేసినా నిర్వాహకుల నుంచి రసీదును తీసుకోండి.

– వై.గోపినాథ్ జిల్లా ఉద్యానశాఖాధికారి, ఒంగోలు

రెండెకరాల్లో మిర్చి సాగుచేశాను



ఈ ఏడాది రెండెకరాల్లో మిర్చి సాగుచేశాను. నర్సరీకి వెళ్లి మొక్క రూ.1.50 ప్రకారం కొనుగోలు చేశాను. ఎకరాకు సుమారు 13 వేల మొక్కలు నాటాను. గత ఏడాది మంచి దిగుబడి ఉండటంతో ఈ సారి కూడా బాగా వస్తాయని అనుకుంటున్నాను. వర్షం లేకపోవడంతో బోర్ల ద్వారా తోటకు నీళ్లు పెడుతున్నా.

– టి.రామిరెడ్డి, మిర్చి రైతు, కొట్టాలపల్లి

పేద ప్రజల కోసం జగనన్న ఆరోగ్య సురక్ష

- ప్రతి పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనం
- అన్ని రకాల అనారోగ్యాలకు ఉచిత వైద్య సేవలు, ఉచితంగా మందులు
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన ఎంపీ మాగుంట, మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: పేద ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్న సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టిందని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన స్థానిక నగరంలోని పీర్లమాన్యంలో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ)లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష పథకం క్యాంపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన, మధ్య తరగతి వర్గాల వారి ఆరోగ్యాన్ని కాపాడటానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ముఖ్యమంత్రి తండ్రి, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజ శేఖర రెడ్డి పేద ప్రజల ఆరోగ్యం కోసం ఆరోగ్య శ్రీ అన్న బృహత్తర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. పైసా ఖర్చు లేకుండా పెద్ద పెద్ద కార్పొరేట్ ఆస్పత్రుల్లో చేర్పించి పేదల ఆరోగ్యాన్ని బాగు చేసిన గొప్ప మానవతావాది అని ఆ మహానేత సేవలను గుర్తు చేశారు. ప్రస్తుతం ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రూ.వెయ్యి దాటిన ఎలాంటి వైద్య సేవలకైనా ఆరోగ్య శ్రీలో అవకాశం కల్పించి పేదల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారని పేర్కొన్నారు. ఒక పక్క ఆరోగ్య శ్రీ పథకాన్ని సమర్థవంతంగా నడిపిస్తూనే మరోపక్క ప్రతి వార్డు, గ్రామ సచివాలయం పరిధిలో ఇప్పటికే ప్రతి ఇంటింటికీ ఏఎన్‌ఎంలను, ఆశా వర్కర్లను, వలంటీర్లను పంపి వైద్య పరీక్షలు చేయించారన్నారు. ఆ తరువాత ఆయా యూపీహెచ్‌సీలు, పీహెచ్‌సీల పరిధిలో సచివాలయాల ఆధారంగా క్యాంపులు నిర్వహించి వైద్య పరీక్షల కేంద్రాలు నిర్వహించి మరీ ఉచితంగా మందులు ఇస్తున్నారని చెప్పారు. అదేవిధంగా ఏమైనా పెద్ద వ్యాధులు ఉంటే ఆరోగ్య శ్రీ రెఫరల్ వైద్యశాలలకు పంపుతున్నారని వివరించారు. ఈ అవకాశాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్ చేస్తున్న మంచిని గుర్తించి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చాలా మంది ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నామని, రూ.లక్షల్లో ఖర్చు అయిందని చెప్పారన్నారు. ఇక నుంచి అలాంటి పరిస్థితులు లేకుండా జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింది ఆరోగ్య శ్రీ పథకంలో ఉచితంగా చేయిస్తామని, కొన్ని ఆపరేషన్లకు ఆరోగ్య శ్రీలో అవకాశం లేకపోతే ఎల్‌ఓసీ ఇప్పించి అయినా ఉచితంగా చేయిస్తానని భరోసా ఇచ్చారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దేశంలో ఏ రాష్ట్రంలో కూడా చేపట్టని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. ఏ ఒక్క ముఖ్యమంత్రికి రానివిధంగా ప్రజల మంచి, మేలు కోరుకునేలా పథకాలు అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. పేదలకు ప్రధానంగా విద్య, వైద్యం ఎంతో అవసరమని, ఆ రెండింటికీ కొదువలేకుండా ప్రజల సంక్షేమాన్ని ముఖ్యమంత్రి స్వయంగా చూసుకుంటున్నారని వివరించారు. ఈ రెండు పథకాలతో పాటు ఇళ్లులేని నిరుపేదలకు సొంతింటి కల కూడా నెరవేరుస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ఎంతో ప్రయోజనకరమన్నారు. ఒంగోలు నగరంలో ఇళ్లు లేని నిరుపేదలకు త్వరలో 25 వేల మందకి ఇళ్ల పట్టాలు ఇచ్చే కార్యక్రమాన్ని సీఎం జగన్ చేతుల మీదుగా చేపడతామన్నారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ దేశంలోనే కాదు ప్రపంచంలోనే ఇలాంటి ఆరోగ్య పథకాలు ఎవరూ ప్రవేశపెట్ట లేదన్నారు. ఇటీవల జగనన్న సురక్ష పథకం ప్రవేశపెట్టి దాదాపు 9 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అదేవిధంగా ఆ కార్యక్రమం పూర్తయి నెల కాకముందే జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. నిరంతరం ప్రజల మంచిని కోరేలా సీఎం ఆలోచనా విధానం ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గోలి లక్ష్మీ కోటేశ్వరమ్మ, డీఎం అండ్ హెచ్‌ఓ రాజ్యలక్ష్మి, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు కఠారి శంకర్, గోలి తిరుపతి రావు, గంటా రామానాయుడు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పథకాలను సమర్ధవంతంగా
అమలు చేయాలి



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత

- జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడిపేందుకు కలిసికట్టుగా పనిచేద్దాం
- కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టుల పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి
- దిశ సమావేశంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

ఒంగోలు అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు సమన్వయంతో పనిచేసి పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసుల రెడ్డి అన్నారు. స్పందన భవనంలో జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ కమిటీ 'దిశ' సమావేశం ఎంపీ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ దినేష్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నగర మేయర్ గంగాడ సుజాత, ట్రైనీ కలెక్టర్ శౌర్యపటేల్ ఇతర అధికారులు పాల్గొన్నారు. తొలుత గత సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన అంశాలు, సమస్యలపై తీసుకున్న చర్యలను అధికారులు వివరించారు. అనంతరం మాగుంట మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పక్కాగా అమలు చేస్తూ కలిసికట్టుగా మరింత అభివృద్ధి పథంలో నడుపుతామన్నారు. రైల్వే, జాతీయ రహదారులు, బీఎస్‌ఎన్‌ఎల్ ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. సింగరాయకొండ వద్ద జాతీయ రహదారిపై అత్యవసర సమయంలో విమానాల ల్యాండింగ్ కోసం నిర్మించిన ఎయిర్ స్ట్రిప్ లోపాలను సరిచేసి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైల్వే క్రాసింగ్‌ల వద్ద ఆర్‌యూబీ, ఆర్‌ఓబీల నిర్మాణాలకు స్థానిక పరిస్థితిని పరిశీలించి, ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని నిర్ణయించాలన్నారు. గ్రామాల్లో అవసరమైన చోట తాగునీటి సరఫరాకు వినియోగించేలా ఐదు వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ట్యాంకులను సమకూరుస్తామన్నారు. కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా అధికార వ్యవస్థను క్షేత్రస్థాయికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకెళ్లిందన్నారు. బెంగళూరు-కడప-విజయవాడ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి దాదాపుగా భూసేకరణ ప్రక్రియ పూర్తి అయిందని చెప్పారు. నిర్వాసితుల బ్యాంకు ఖాతాల్లో నష్టపరిహారం కూడా జమైనట్లు తెలిపారు. కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు ఈ నెలాఖరుకు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ గ్రామీణ రోడ్లు, పారిశుధ్యం, తాగునీటి అవసరాలు తీర్చేందుకు జెడ్పీ నిధులను ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీ లాడ్స్ నిధులను కూడా ప్రాధాన్యత అవసరాలకు కేటాయించాలని ఎంపీని కోరారు. జిల్లాలో కరువు మండలాలు ఎక్కువగా ఉండటం మంచి నీటి వనరులు తక్కువగా ఉన్నందున సీపీడబ్ల్యూ పథకాలకు జెడ్పీ నిధులను గరిష్ట స్థాయిలో ఖర్చు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

ఒంగోలు నగర మేయర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలో విలీనమైన గ్రామాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అవసరమైన చోట కల్వర్టులు, డ్రైనేజీల నిర్మాణం, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, రోడ్ల మరమ్మతు ప్రాధాన్యత ప్రాతిపదికన చేపట్టేందుకు అవసరమైన సహకారం అందించాలని కోరారు.

జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు మాట్లాడుతూ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టర్ల బిల్లులు వేగంగా చెల్లించాలని కోరారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, డ్వామా పీడీ శ్రీనారెడ్డి, సీపీఓ వెంకటేశ్వర్లు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డిని కలిసిన నేతలు



వల్లూరులోని ఢిల్లీ హైవే హోటల్లో టిఫిన్ చేస్తున్న విజయ సాయిరెడ్డి, బాలినేని, మాగుంట, వరికూటి, శిద్దా సుధీర్‌బాబు, పలువురు

టంగుటూరు: రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి స్వగ్రామం తాళ్లపూడికి వెళ్తూ మార్గం మధ్యలో అల్పాహారం కోసం టంగుటూరు మండలంలోని వల్లూరు గ్రామ సమీపంలో ఉన్న ఢిల్లీ హైవే హోటల్‌కు వచ్చారు. మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, టీటీడీ బోర్డు మెంబర్ శిద్దా సుధీర్‌బాబుతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డిని పలువురు ఘనంగా సన్మానించారు. అనంతరం కాసేపు పార్టీ వ్యవహారాలపై మాట్లాడి స్వగ్రామం బయలుదేరారు. విజయసాయిరెడ్డిని కలిసినవారిలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, తాడిపర్తి చంద్రశేఖర్, కుందం హనుమారెడ్డి, గుండపరెడ్డి శ్రీహరిరెడ్డి, తదితరులు ఉన్నారు.

27న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

- కలెక్టర్ దినేష్‌కుమార్


ఒంగోలు అర్బన్: ఈ నెల 27వ తేదీ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేస్తామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. ప్రకాశం భవనంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన పురోగతిని వివరించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం ఈ నెల 27వ తేదీ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసి దానిపై అభ్యంతరాలు స్వీకరించేందుకు ఈ నెల 28, 29 రెండు రోజుల పాటు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తామన్నారు. బీఎల్‌ఓలను సంప్రదించి అభ్యంతరాలు ఉంటే తెలియచేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. అదేవిధంగా నవంబర్ 18, 19 తేదీల్లో రెండు రోజులపాటు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తామన్నారు. జిల్లాకు వచ్చిన ఓటింగ్ యంత్రాలకు ఫస్ట్ లెవల్ చెకింగ్ ప్రక్రియ కూడా ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేరకు ఈ నెల 16వ తేదీ నుంచి చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ శ్రీలత, వైఎస్‌ఆర్ పార్టీ ప్రతినిధి జీ సుబ్బారావు, ఇతర పార్టీల ప్రతినిధులు రాజశేఖర్, సత్యం, రసూల్, కాలేషా, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న కాలనీ ఇళ్లు ప్రారంభం

- జిల్లా వ్యాప్తంగా పూర్తయిన 21,757 ఇళ్లు ప్రారంభోత్సవానికి సిద్ధం
- చీమకుర్తి మున్సిపాలిటీలోని కేవీ పాలెం జగనన్న లేఅవుట్‌లో జిల్లా కార్యక్రమాన్ని ప్రారంభించనున్న మంత్రులు మేరుగ, ఆదిమూలపు, బూచేపల్లి, కలెక్టర్



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న చీమకుర్తి మున్సిపాలిటీలోని కేవీ పాలెం లేఅవుట్ ఆర్చి నిర్మాణం, పక్కన పైలాన్



కేవీ పాలెం లేఅవుట్‌లో నిర్మాణాలు పూర్తయిన ఇళ్లు

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన జగనన్న కాలనీల ఇళ్లను గురువారం చీమకుర్తిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగ నాగార్జున, జిల్లా మంత్రి ఆదిమూలపు సురేష్, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. దానికి గాను ఇప్పటికే కేవీ పాలెం లేఅవుట్‌లో ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 21,757 ఇళ్ల నిర్మాణం పూర్తికాగా పూర్తయిన వాటన్నిటినీ ప్రారంభించే కార్యక్రమాన్ని చీమకుర్తి మున్సిపాలిటీలోని కేవీ పాలెం లేఅవుట్‌లో నిర్వహిస్తున్నారు. కేవీ పాలెం లేఅవుట్‌లో మొత్తం 575 ఇళ్లు మంజూరు కాగా వాటిలో ఇప్పటి వరకు 50 శాతానికి పైగా అంటే 277 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. జిల్లా మొత్తం మీద నిర్మించిన జగనన్న కాలనీల్లో కేవీ పాలెం లేఅవుట్‌ను కలెక్టర్ దినేష్ కుమార్ మోడల్ కాలనీగా ప్రకటించటంతో జిల్లా ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చీమకుర్తి మున్సిపాలిటీలో చేయాలని నిర్ణయించారు. దానిలో భాగంగా ఇప్పటికే కేవీ పాలెం లేఅవుట్ ఎంట్రెన్స్ ఆర్చి నిర్మాణం, రోడ్లు, మౌలిక వసతులను కల్పించటంలో మున్సిపల్ కమిషనర్, హౌసింగ్ డిపార్టుమెంట్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రారంభోత్సవానికి ముస్తాబు చేశారు.

మండల ప్రత్యేక స్పందన పామూరులో..

ఒంగోలు అర్బన్: ప్రతి శుక్రవారం మండలాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ శుక్రవారం పామూరులో కలెక్టర్ దినేష్‌కుమార్ ఆధ్వర్యంలో మండల స్పందన నిర్వహిస్తున్నట్లు కలెక్టరేట్ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. పామూరులోని ఏజీకే అనిల్ గార్డెన్స్ కళ్యాణ మండపంలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం హాజరవుతుందని మండల ప్రజలు స్పందనను సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

క్లుప్తంగా

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన పీడీసీసీబీ చైర్మన్



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న బన్నీ దంపతులు

ఒంగోలు: పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి (బన్నీ), కనిగిరి ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ వై.సరితారెడ్డి దంపతులు బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. పీడీసీసీబీ చైర్మన్ పదవి ఇచ్చినందుకు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కనిగిరి నియోజకవర్గంలో పార్టీ గెలుపునకు కృషి చేయాలని వారికి సీఎం సూచించారు.

పర్యావరణ పరిరక్షక బోధకునిగా జగన్నాథ్



జగన్నాథ్

మార్కాపురం టౌన్: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత టి.నాగజగన్నాథ్‌ను పర్యావరణ పరిరక్షక బోధకునిగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రానికి చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు సాధించిన 40 మందిని కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసి వారి సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించినట్లు జగన్నాథ్ తెలిపారు. అందులో భాగంగా ఎంపికైన తాను నైతిక విలువలు, పర్యావరణ పరిరక్షణ అంశాలపై హైస్కూళ్లకు వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధించనున్నట్లు చెప్పారు.

పాడి రైతులకు గరిష్ట లబ్ధి చేకూరాలి

- జగనన్న పాలవెల్లువపై కలెక్టర్ దినేష్‌కుమార్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఆసరా, చేయూత లబ్ధిదారులను జగనన్న పాలవెల్లువ కార్యక్రమానికి అనుసంధానించి పాడి రైతులకు గరిష్ట లబ్ధిచేకూరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రకాశంభవనంలో జగనన్న పాలవెల్లువపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమం అమలవుతున్న 16 మండలాల్లో 244 గ్రామాల్లో పురోగతిపై ఆరా తీశారు. ప్రతి ఏఎంసీయూలో కచ్చితంగా 11 మంది ప్రమోటర్లు, సెక్రటరీలు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. పథకం లక్ష్యాలు, అందే ప్రయోజనాలపై క్షేత్రస్థాయిలో పాడి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. చేయూత, ఆసరా పథకాలతో పాడి పశువులు కొనుగోలు చేసిన లబ్ధిదారులను జేవీపీకి అనుసంధానం చేసి పాల ఉత్పత్తి పెంచాలన్నారు. రాబోయే రెండు వారాల్లో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, పశుసంవర్థకశాఖ జేడీ, అమూల్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్మీ ఉద్యోగికి జైలు శిక్ష

దర్శి: భార్యను హింసించిన కేసులో ఆర్మీ ఉద్యోగికి ఏడాది జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి జీవీఎల్ సరస్వతి బుధవారం తీర్పు చెప్పారు. హనుమంతునిపాడు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి బద్దెపూడి బాస్కర్ భార్యను అనుమానిస్తూ వేధించాడు. 2019 సెప్టెంబర్ 2వ తేదీ మద్యం సేవించి భార్యను కొట్టి రెండో పెళ్లి చేసుకుంటానని బెదిరించారు. ఆమె ఫిర్యాదు మేరకు శారీరక, మానసిక హింసపై నమోదైన కేసుపై సమగ్ర దర్యాప్తు అనంతరం అప్పటి దొనకొండ ఎస్సై రమేష్ కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. సరైన సాక్ష్యాధారాలతో నిందితునిపై నేరం రుజువైంది. దీంతో న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు.

దర్యాప్తు వేగవంతం చేయండి

- స్పీడ్ ట్రయల్ మానిటరింగ్‌తో నేరాలు రుజువు చేయాలి
- దొంగతనాల్లో రికవరీ శాతం పెంచాలి
- నేర సమీక్షలో దిశానిర్దేశం చేసిన ఎస్పీ మలికాగర్గ్



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్



హాజరైన డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు

ఒంగోలు సబర్బన్: కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్పీ మలికాగర్గ్ దిశా నిర్దేశం చేశారు. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలోని గెలాక్సీ భవన్‌లో బుధవారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్న సమీక్షలో కేసు దర్యాప్తు, పరిశోధనల్లో పురోగతిని సాధించాలని ఆదేశించారు. కోర్టుల్లోని కేసుల విషయంలో స్పీడ్ ట్రయల్ ద్వారా నేరాలు రుజువు చేసేందుకు చేయాల్సిన అన్నిరకాల కసరత్తులు చేపట్టాలని సూచించారు. రౌడీషీట్లలో ఉన్న వారి కేసుల విషయంలో అప్రమత్తంగా ఉండి వారికి శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలన్నారు. తీవ్రమైన కేసులు, పీడీ యాక్టులకు సంబంధించిన అంశాలపై ఎస్పీ లోతుగా సమీక్షించారు. ప్రతి కేసులోనూ పూర్తి స్థాయి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. తీవ్ర నేరాలకు సంబంధించి షీట్లు ఉన్న వారి కేసుల దర్యాప్తులో వేగం పెంచాలన్నారు. అలాంటి కేసులకు సంబంధించి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు, ప్రస్తుతం కోర్టులో అలాంటి కేసులు ట్రయల్ ఏ దశలో ఉన్నాయి అన్న అన్ని అంశాలను లోతుగా దర్యాప్తు అధికారులను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత కేసులకు సంబంధించి ఉన్న సీడీ ఫైల్స్‌ను క్షుణ్ణంగా ఎస్పీ పరిశీలించారు. స్పీడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా షీట్లలో ఉన్న నిందితులకు తగిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

హత్య కేసులతో పాటు అత్యాచారం, పోక్సో, ప్రాపర్టీ రికవరీ, గంజాయి లాంటి కేసులకు సంబంధించి కూడా లోతుగా అధ్యయనం చేయాలన్నారు. తీవ్రమైన కేసుల దర్యాప్తుతో పాటు నిందితుల అరెస్టులపై జిల్లాలోని సర్కిల్ వారీగా సమీక్ష నిర్వహించారు. అపరిష్కృతంగా ఉన్న తీవ్రమైన కేసుల్లో నాణ్యమైన పరిశోధన చేస్తే పురోగతి సాధించటంతో పాటు పరిష్కారం కూడా సులభతరం అవుతుందని ఎస్పీ సూచించారు. కేసు నమోదు నుంచి చార్జ్‌షీట్ సిద్ధం చేసే వరకూ ప్రతి విషయాన్ని కూలంకుషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు.

కేసుల ఛేదనలో టెక్నాలజీని వినియోగించాలి

తీవ్రమైన కేసులు, సంచలనం సృష్టించిన కేసులను ఛేదించడంతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు ఎస్పీ సూచించారు. కొత్త తరహా సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా అందిపుచ్చుకోవాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వాహన తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చాలానాలు విధించాలని, వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. రహదారులపై వాహనాల తనిఖీ వేగవంతం చేయాలన్నారు. రాత్రి వేళల్లో గస్తీని పెంచాలని, దొంగతనాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ ఎక్కువ కేసుల్లో ఉన్న వారిపై పీడీ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవటానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. దసరా నవరాత్రుల నేపథ్యంలో జిల్లాలోని ప్రముఖ దేవాలయాలు, క్షేత్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేర సమీక్షలో ఏఎస్పీ(అడ్మిన్)కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ(క్రైం) ఎస్‌వీ శ్రీధరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, డీఎస్పీలు నారాయణస్వామిరెడ్డి, రామరాజు, అశోక్ వర్ధన్, వీర రాఘవరెడ్డి, వి.శ్రీనివాసులు, సీహెచ్ శ్రీనివాసరావు, లీగల్ అడ్వయిజర్ వేణుగోపాల్, డీసీఆర్‌బీ సీఐ ధర్మేంద్ర బాబు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రకాశించాలి

- కబడ్డీ జిల్లాస్థాయి పోటీల్లో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు





పోటీల్లో తలపడుతున్న బాలబాలికల జట్లు

చీమకుర్తి: త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రకాశం జిల్లా జట్టు విజయం సాధించి జిల్లాకు పేరుప్రతిష్టలు తీసుకురావాలని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ క్రీడాకారులకు పిలుపునిచ్చారు. సంతనూతలపాడు జెడ్పీ హైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ క్రీడా పోటీలకు ప్రాధాన్యమిస్తున్నారన్నారు. త్వరలో ఆడుదాం-ఆంధ్రా పేరుతో సచివాలయ స్థాయిలో క్రీడాపోటీలను సీఎం ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పలు హైస్కూళ్ల నుంచి వచ్చిన 800 మంది క్రీడాకారులకు అండర్-14, 17 బాలబాలికల విభాగాలలో వేరువేరుగా పోటీలు నిర్వహించారు. పలు హైస్కూళ్ల నుంచి హాజరైన 200 మంది పీడీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారితో ప్రకాశం జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు స్కూలు గేమ్స్ ఫెడరేషన్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, స్థానిక సర్పంచ్ దర్శి నాగమణి, సొసైటీ ప్రెసిడెంట్ దుంపా యలమందారెడ్డి, స్థానిక వైస్ ఎంపీపీ తన్నీరు రాగమ్మ, ఎంపీటీసీ సుబ్బారావు, స్కూలు గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వనజ, హెచ్‌ఎం, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

పేద ప్రాణంపై కార్పొరేట్ ఆస్పత్రి దాష్టీకం

- చికిత్స పేరుతో రూ.9 లక్షల వరకూ వసూలు
- మరో రూ.2 లక్షలు ఇవ్వాలని ఒత్తిడి
- ఫీజు ఇవ్వలేదని అర్ధరాత్రి ఆస్పత్రి నుంచి గెంటివేత
- 108 సహాయంతో రిమ్స్‌లో చేరిక
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు
- విచారణకు ఆదేశించిన కలెక్టర్
- ఫీజులు వాపసు ఇప్పించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓకు ఆదేశాలు



రిమ్స్‌లో అపస్మారక స్థితిలో ఉన్న ఆదిలక్ష్మి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆదిలక్ష్మి తలిదండ్రులు వెంకటేశ్వర్లు, నాగమ్మ

ఒంగోలు టౌన్: చికిత్స కోసం వచ్చిన ఒక పేద కుటుంబాన్ని నగరంలోని ఒక ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రి చేతికందిన కాడికి దోచుకుంది. అయినాసరే కడుపునిండని వైద్యశాల నిర్వాహకులు.. అడిగినంత డబ్బు చెల్లించలేదని ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగిని అర్ధరాత్రి వైద్యశాల నుంచి పంపించి వేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ... యర్రగొండపాలేనికి చెందిన బెల్లంకొండ ఆదిలక్ష్మిపై భర్త చినగురవయ్య, అతడి కుటుంబ సభ్యులు కలిసి ఆగస్టు చివరలో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిని ఆదిలక్ష్మి పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యులు ఆమెను మెరుగైన చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో పనిచేస్తున్న బాధితుడి తాలూకా బంధువు ఒకరు ఇక్కడి కంటే చికిత్స బయట ఆస్పత్రిలో బాగుంటుందని, అక్కడి డాక్టర్లు తనకు బాగా తెలుసని చెప్పి రిమ్స్ ఎదురుగా ఉన్న లక్ష్మీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. తొలుత రూ.లక్ష ఖర్చు చేస్తే మీ అమ్మాయి కోలుకుంటుందని మధ్యవర్తి నమ్మించి వైద్యశాలలో చేర్పించారు. అసలు కథ అప్పుడు ప్రారంభమైంది. మొదట రూ.40 వేలు అడ్వాన్స్ కట్టించుకున్నారు. ఆ తర్వాత అర్జంటుగా ఆపరేషన్ చేయాలి రూ.70 వేలు కట్టమన్నారు. అలా మొదలుపెట్టిన వైద్యశాల నిర్వాహకులు రోగి నుంచి విడతలవారీగా రూ.9 లక్షల వరకూ వసూలు చేశారు. 40 రోజులు దాటిపోయినా రోగి మాత్రం కోలుకోలేదు. కానీ, మరో రూ.2 లక్షలు చెల్లించాలని, లేకపోతే వైద్యం చేయమని నిర్వాహకులు ఒత్తిడి చేయడం మొదలెట్టారు. ఆదిలక్ష్మి తలిదండ్రులు వల్లబాయి వెంకటేశ్వర్లు, నాగమ్మ కూలి పనులు చేసుకుంటూ బతుకుబండి లాగుతుంటారు. రెక్కాడితేగానీ డొక్కాడని వారు.. బిడ్డ బతుకుతుందన్న ఆశతో యర్రగొండపాలెంలోని ఇంటిని తాకట్టు పెట్టి మరీ డబ్బు తెచ్చారు. చివరికి మందులకు కూడా డబ్బు లేకపోవడంతో భార్యాభర్తలిద్దరూ కలిసి ఒంగోలు ఆర్టీసీ బస్టాండుకు వెళ్లి బిక్షాటన చేసి రూ.3 వేలు తెచ్చి మందులు కొనుగోలు చేశారు. మరో రూ.2 లక్షలు చెల్లిస్తేగానీ ఇకముందు వైద్యం చేయడం కుదరదని తేల్చిచెప్పడంతో ఆందోళనకు గురైన బాధితురాలి తల్లి నాగమ్మ వైద్యశాల నిర్వాహకులను బతిమాలుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. అంతేగాకుండా నాగమ్మను వైద్యశాల నిర్వాహకుడు రాజా దూషించడంతో పాటు దురుసుగా ప్రవర్తించినట్లు కన్నీటి పర్యంతమైంది. గత సోమవారం రాత్రి అపస్మారక స్థితిలో ఉన్న ఆదిలక్ష్మికి చికిత్స చేయకుండా డిశ్చార్జి సమ్మరి ఇవ్వకుండా బయటకు పంపించారు. ఏం చేయాలో దిక్కుతోచక రోదిస్తూ స్థానికుల సలహా మేరకు 108కు ఫోన్ చేసి రిమ్స్‌కు వెళ్లారు. ఆదిలక్ష్మి పరిస్థితి విషమంగానే ఉండటంతో ఐసీయూలో చేర్చారు. అయితే రోగుల వద్ద డిశ్చార్జి రిపోర్టు లేకపోవడంతో ఆమెకు ఎలాంటి వైద్యం జరిగిందో తెలియక తదుపరి ఏం చికిత్స చేయాలో అర్థంగాక వైద్యులు గందరగోళంలో పడ్డారు.

విచారణకు ఆదేశించిన కలెక్టర్ దినేష్‌కుమార్...

ఆదిలక్ష్మి తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, నాగమ్మ బుధవారం కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. రూ.9 లక్షలు వసూలు చేయడంపై కలెక్టర్ ఆశ్చర్యానికి గురయ్యారు. డిశ్చార్జి రిపోర్టు ఇవ్వకపోగా మరో రూ.2 లక్షలు ఇవ్వాలని ఒత్తిడి చేసిన లక్ష్మీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై వెంటనే డీఎంఅండ్‌హెచ్‌ఓను విచారణకు ఆదేశించారు. చికిత్స పేరుతో వసూలు చేసిన డబ్బు మొత్తం తిరిగి ఇప్పించాలని సూచించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆదిలక్ష్మిని గుంటూరు తరలించి మరింత మెరుగైన చికిత్స అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

డబ్బు చెల్లించకపోతే రిపోర్టులు ఎలా ఇస్తామన్న ఆస్పత్రి నిర్వాహకుడు...

ఆస్పత్రికి చెల్లించాల్సిన ఫీజు మొత్తం చెల్లించకపోతే డిశ్చార్జి సమ్మరి ఎలా ఇస్తామని ఆస్పత్రి నిర్వాహకుడు కృష్ణ నిర్లక్ష్యంగా జవాబిచ్చారు. ఆదిలక్ష్మి విషయం గురించి వివరణ కోసం వెళ్లిన మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యం అంటేనే లక్షల్లో ఖర్చవుతుందని చెప్పడం గమనార్హం.

పేదల తలరాతను మార్చిన సీఎం జగన్



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

పెద్దారవీడు: పేదవారి జీవితాల్లో వెలుగు నింపి వారి తలరాతను మార్చాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని బోయిదగుంపుల సచివాలయం పరిధిలో కర్రోల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్ల కాలంలో ఎంతెంత లబ్ధిపొందారో వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందించారు. స్థానికులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాల మెరుగు కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో లంచాలకు, వివక్షలకు తావులేకుండా, కార్యాలయాల చుట్టూ తిరిగే దుస్థితి లేకుండా గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అత్యంత పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. జగనన్న మేనిఫెస్టోలోని ప్రతి హామీని అమలు చేసి ప్రజల గుండెల్లో దేవుడిగా నిలిచిపోయారని, అన్ని వర్గాలు అభివృద్ధి చెందాయని, ప్రతి గడపలోనూ సంతోషం వెల్లివిరుస్తోందన్నారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వానికి, గత చంద్రబాబు ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాలను ప్రజలు గమనించాలని, కేవలం అధికారం దాహంతో మోసగాళ్లు ఒక్కటై సీఎం జగనన్నను ఎదుర్కోవాలని చూస్తున్నారని పేర్కొన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ప్రతిపక్షాల కడుపు ఎందుకు మండిపోతోందో అర్థం కావడం లేదని విమర్శించారు. దేశంలో ఏ సీఎం చేపట్టని విధంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు.. జగనన్నే మా ధైర్యమే అంటున్నారని తెలిపారు. మోసం చేయడం చంద్రబాబు నైజం అయితే చెప్పిన మాటకు కట్టుబడి చిత్తశుద్ధితో హామీలు అమలు చేయడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నైజమని అన్నారు. అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, తదితర నవరత్నాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని, ప్రజా శ్రేయస్సు ధ్యేయంగా జగనన్న పాలన సాగిస్తున్నారని వివరించారు. వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించి మరోసారి సీఎం చేసుకుంటే మరెన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఆదుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పోలిరెడ్డి కృష్ణారెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, సర్పంచ్ బలుసుపాటి లూథీయా నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు చిమట వెంగయ్య, వెంకట రామయ్య, చెంచయ్య, ఒద్దుల లక్ష్మిరెడ్డి, నాగార్జునరెడ్డి, తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి, ఎంపీడీఓ రాజ్‌కుమార్ నాయక్, డీఎల్‌డీఓ సాయికుమార్, విద్యుత్, హౌసింగ్, పంచాయతీరాజ్ ఏఈలు రమేష్, శ్రావ్య, రవీంద్రరెడ్డి, ఏఓ బుజ్జిబాయి, ఏపీఎం శ్రీనివాసులు, ఏపీఓ సాంబశివయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరలే స్వామినాథన్‌కు నివాళి



డాక్టర్ స్వామినాథన్‌కు నివాళి అర్పిస్తున్న రైతు సంఘాల నాయకులు

ఒంగోలు టౌన్: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను సాధించడమే హరిత విప్లవ పితామహుడు డాక్టర్ స్వామినాథన్‌కు నిజమైన నివాళి అవుతుందని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు అన్నారు. లింగయ్య భవనంలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ స్వామినాథన్‌తో పాటుగా రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎర్నేని నాగేంద్రనాథ్, సాగునీటిరంగా నిపుణులు చెరుకూరి వీరయ్యల సంతాప సభ నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన చుండూరి మాట్లాడుతూ ఆహార కొరతతో సంక్షభంలో చిక్కుకున్న దేశాన్ని రక్షించేందుకు అధిక దిగుబడినిచ్చే గోదుమలు, వరి విత్తనాలను అభివృద్ధి చేసి దేశానికి ఇచ్చిన స్వామినాథన్ సేవలను ఎన్నటికీ మరిచిపోలేమన్నారు. ఆహార ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేయడంలో ఆయన కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ఎన్నో జాతీయ అంతర్జాతీయ అవార్డులను అందుకొన్న ఆయన దేశానికి గర్వకారణంగా నిలిచారని చెప్పారు. సమావేశంలో ఆచార్య రంగా కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య, ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పెంట్యాల హనుమంతరావు, ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ , రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి లలిత కకుమారి, జర్నలిస్టు సంఘాల నాయకులు నాగేశ్వరరావు, బ్రహ్మం, కరవది సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, పిన్నిక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో జిల్లా విద్యార్థి సత్తా



అవార్డు అందుకుంటున్న నిఖిల్‌చంద్

ఒంగోలు: జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో పుల్లలచెరువు మండలం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి మల్లెల నిఖిల్‌చంద్ సత్తాచాటారు. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు ఢిల్లీలో జరిగిన ఈ పోటీల్లో ఫ్యాబ్రికేషన్ ఆఫ్ ఫోర్ వేస్ హ్యాక్‌సా మెషీన్ ప్రాజెక్టును ప్రదర్శించారు. జాతీయ స్థాయిలో మొత్తం 60 ప్రాజెక్టులను ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపిక చేశారు. రాష్ట్రం తరఫున 35 మంది ప్రాజెక్టులు ప్రదర్శించగా, వాటిలో నాలుగు ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపికయ్యాయి. వాటిలో మన జిల్లాకు చెందిన నిఖిల్‌చంద్ ప్రదర్శన ఒకటి. కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్రసింగ్ చేతుల మీదుగా మంగళవారం నిఖిల్‌చంద్ అవార్డు అందుకున్నారు. అతనితో పాటు గైడ్ ఉపాధ్యాయుడు మస్తాన్‌వలిని డీఈవో వీఎస్ సుబ్బారావు, మార్కాపురం, ఒంగోలు ఉప విద్యా శాఖ అధికారులు చంద్రమౌళీశ్వర్, అనితరోజ్‌రాణి అభినందించారు.

రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

చీమకుర్తి: స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం చీమకుర్తి ప్రభుత్వ హైస్కూలులో జిల్లాస్థాయిలో నిర్వహించిన బేస్‌బాల్ పోటీల ఎంపికలో రాష్ట్రస్థాయి క్రీడాకారుల జట్లను ఎంపిక చేశారు. అండర్-14, 17 విభాగాల్లో ప్రతిభ ప్రదర్శించిన క్రీడాకారులను పీడీలు, పీఈటీలు ఎంపిక చేశారు. ఎంపికైన వారిని లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ బీ.జవహర్, హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, టీచర్‌లు అభినందించారు.



బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు